# ఈ క్రొత్త సంవత్సరము ఎవరిది? ఎవరు ప్రవేశపెట్టారు?

ఈ లోకాధికారి సాతాను. వాడు సర్వలోకమును మోసపుచ్చుచున్న మోసగాడు అని ప్రకటన 12:9 తెలియపర్చుచున్నది. ఏర్పాటు చేయబడిన విశ్వాసులను సహితం మోసం చెయ్యగలుగుతున్నాడంటే ఆశ్చర్యపడనవసరం లేదు. వాడు నీతిపరిచారకుల వేషం ధరించి సంస్థానాధిపతిగా, బిషప్‌గా, పాస్టర్‌గా, రెవరెండ్‌గా, అపోస్తలునిగా, ప్రవక్తగా, అబ్బో బైబిలు బోధకునిలా బైబిల్ చేతపట్టి ప్రజల్ని మోసం చేసేస్తున్నాడు. వాడొక పెద్ద డూప్లికేట్ బోధకుడు. సంస్థలను నడిపిస్తున్న సంస్థానాధిపతి. కూలి బోధకులకు జీతాలిచ్చి సంస్థల్లో పోషిస్తున్న గొప్ప స్పాన్సర్. ఈ డినామినేషన్లు అన్నింటికీ వాడే శిరస్సు. వీడు సంస్థానాధిపతిగా, బిషప్‌గా, రెవరెండ్‌గా, సూపర్‌వైజర్‌గా, హెడ్‌గా అనేక సంఘాలను నాశనానికి నడిపిస్తున్న బైబిల్ బోధకుడు. వీడి బోధ అంతా బైబిల్‌కి వ్యతిరేకమే. బైబిల్ పట్టుకున్న తండోపతండ జనసమూహములను వాడి యుక్తి, కుయుక్తి, కుట్ర ఆలోచనలతో దారితప్పించివేస్తున్నాడు. బైబిల్లో పరమతండ్రి యిచ్చిన క్యాలెండరు ఉంది. దానికి డూప్లికేట్ క్యాలెండర్: జూలియస్ సీజర్ ద్వారా B.C 45లో జూలియన్ క్యాలెండర్‌ను, A.D 1582లో పోప్ గ్రిగోరీ XIII ద్వారా గ్రిగోరియన్ క్యాలెండర్‌ను తయారుచేయించి బైబిల్ క్యాలెండర్‌ను ప్రజలకు మరుగు చేసినాడు. తద్వారా వచ్చినవే జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే, జూన్, జూలై, ఆగష్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిశెంబర్ అను నెలలు. ఈ సాతానుడు డూప్లికేట్ క్యాలెండర్ ద్వారా అసలు క్యాలెండర్‌ని ప్రజలకు అందనివ్వకుండా చేసినాడు. దానికి బైబిల్ పట్టుకొని బోధలు చేస్తున్న ఈ అబద్ధ బోధకులందరూ దాసోహం చేస్తున్నారు. జనవరి క్రొత్త సంవత్సరము అని గాని, సంవత్సరానికి మొదటి నెల జనవరి అని గాని బోధించే బోధకులందరూ సాతాను ఉచ్చులో ఉన్నవారే. చూడండి బైబిల్లో ఉన్న క్యాలెండర్.

| బైబిల్ నెలలు | దినములు | రిఫరెన్స్ | రోమన్–క్యాలెండర్ |
|---|---|---|---|
| 1. నీసాన్/అబీబ్ | 30 దినములు | ఎస్తేరు 3:7 | మార్చి–ఏప్రిల్ |
| 2. జీఫ్/ఇయ్యార్ | 29 దినములు | 1రాజులు 6:1 | ఏప్రిల్–మే |
| 3. సీవాన్ | 30 దినములు | ఎస్తేరు 8:9 | మే–జూన్ |
| 4. తమ్మూజ్ | 29 దినములు | జెకర్యా 8:19 | జూన్–జూలై |
| 5. అవ్ | 30 దినములు | యిర్మీయా 52:12 | జూలై–ఆగష్టు |
| 6. ఏలూల్ | 29 దినములు | నెహెమ్యా 6:15 | ఆగష్టు–సెప్టెంబర్ |
| 7. ఏతనీమ్/టిష్రీ | 30 దినములు | 1రాజులు 8:2 | సెప్టెంబర్–అక్టోబర్ |
| 8. బూల్/మార్హెషెవాన్ | 29 దినములు | 1రాజులు 6:38 | అక్టోబర్–నవంబర్ |
| 9. కిస్లేవ్ | 30 దినములు | జెకర్యా 7:1 | నవంబర్–డిశెంబర్ |
| 10. టెబెత్ | 30 దినములు | ఎస్తేరు 2:16 | డిశెంబర్–జనవరి |
| 11. శెబాట్ | 30 దినములు | జెకర్యా 1:7 | జనవరి–ఫిబ్రవరి |
| 12. ఆదార్ | 29 దినములు | ఎస్తేరు 3:13 | ఫిబ్రవరి–మార్చి |

**బైబిల్లో చెప్పబడిన మొదటినెల (నీసాన్/అబీబ్) రిఫరెన్సులు:**

1. నీ ఎలోహీం అయిన యావె యొక్క కన్నులు సంవత్సరాది (నీసాన్/అబీబ్ 1నుండి) మొదలుకొని సంవత్సరాంతము (ఆదార్ 29 వరకు) ఎల్లప్పుడు దానిమీద ఉండును........................................ ద్వితీ 11:12
2. సంవత్సరమును దయాకిరీటము ధరింపజేసియున్నావు....... కీర్తనలు 65:11
3. నెలలలో ఈ నెల మీకు మొదటిది ఇది మీ సంవత్సరమునకు మొదటినెల..నిర్గమ 12:2
4. నీసాన్ మాసమున (జనవరి కాదు) అనగా ప్రథమ మాసమున...ఎస్తేరు 3:7
5. అబీబ్ అను నెలను ఆచరించి నీ ఎలోహీం అయిన యావెకు పస్కాపండుగ జరిగింపవలెను ..................................................ద్వితీ16:1

ప్రియ సహోదరుడా, సహోదరీ!

లేఖనములపరంగా ప్రపంచానికి సూర్యుడు ఒక్కడే, చంద్రుడు ఒక్కడే. వాటివలననే సూచనలు, కాలములు, దినములు, వారములు, నెలలు, సంవత్సరములు లెక్కించబడుచున్నవి. ఆదికాండం 1:14–18.నెలపొడుపు (The beginning of the months) ద్వారా నెల ఆరంభమగుచున్నది (సంఖ్యా 10:10+28:11) సూర్యాస్తమయమునుండి సూర్యాస్తమయమువరకు ఒక దినము, అంటే 24 గంటలు. (ఆది 1:5+లేవీ 23:32+నెహెమ్యా 13:19) వారమునకు ఏడు దినములు (ఆది 1:5, 8:13,19,23,31+2:2) నెలకు 30,29 దినములు, సంవత్సరమునకు 12 నెలలు, (1దిన 27:2,4,5,7,8,9, 10,11,12, 13,14,15) దినమునకు 24 గంటలు (యోహాను 11:9) ఇది బైబిలు చెప్పుతున్న నగ్నసత్యము. పాపం ఈ అబద్ధబోధకులు చాలా తేలికగా చెప్పేస్తున్నట్లు "జనవరి" అంటే సంవత్సరాది కాదు, సంవత్సరాది అంటే నీసాన్/అబీబ్: సంవత్సరాంతము అంటే ఆదార్‌ను సూచిస్తుంది. సాతానుడు సూపర్ డూప్లికేట్, గనుక వాడి బోధకులు చేసేది అంతా డూప్లికేట్ పని (2కొరింథీ 11:14) అందువలనే డూప్లికేట్ క్యాలెండర్‌ను వాడుచున్నారు

ఉదాహరణకి ఒక్కవిషయం: 1రాజులు 12:32 ఇక్కడ సాతాను మిషనరీ/సంస్థానాధిపతి రెండు ఆలయాలు కట్టించి కూలిబోధకులను ఏర్పరచి లేవీయులైన అసలు బోధకులు 7వ నెల 15వ దినమును పర్ణశాలల పండుగ బైబిలు ప్రకారముగా ఆచరించుచున్నట్లుగా ఈ డూప్లికేట్ మిషనరీ 8వనెల 15వ దినమును ఆచరించుచున్నాడు. చూసారా! వీడి డూప్లికేట్ పండుగ తేదీ? అసలు పండుగ 7వనెల 15వ దినమయితే, వీడిది 8వ నెల 15వ తేదీ. అలాదారి తప్పించాడు ఆనాటి ఇశ్రాయేలీయులను. ఈనాడు ఈ క్రైస్తవ బోధకులందరూ ఇదే పని చేస్తున్నారు. సంస్థలన్నీ ఇంతే. వీళ్ళ పండుగదినాలకు బైబిలు ఆధారాలు లేవు. ఉంటే చూపించమనండి. డిశెంబర్ 25న మెస్సీయ జన్మించలేదు. అది వీళ్ళ దొంగబోధ.

పాఠకులైన మిమ్ములను ఒక ప్రశ్న అడగనివ్వండి: నేను మార్చి 17 శనివారం పుట్టాను. నా పుట్టిన రోజు ప్రతీ సం॥ శనివారమే వస్తుందా? మరి మెస్సీయ శుక్రవారం చనిపోయాడని అబద్ధాలు బోధిస్తున్న ఈ అబద్ధబోధకుల అందరికీ ఆయన మరణదినం ప్రతీ సం॥ము శుక్రవారమే ఎలా వస్తుందో కొంచెం వివరించి చెప్పమనండి. చదువుకున్నవారికి జ్ఞానం లేదా? చదువులేనివారికి దీనిని వివరించి చెప్పలేరా? ఏదో గొప్ప వేదాంత విద్య అభ్యసించామని గొప్పలు చెప్పుకునే రెవరెండ్లకు బుర్ర ఎక్కడుంది? మెస్సీయ పస్కా పశువుగా మొదటి నెల అంటే నీసాన్ లేక అబీబ్ 14వ తేదీన చనిపోయాడు. అబీబ్ 14 ప్రతీ సం॥ము శుక్రవారమే ఎలా వస్తుంది? తేదీ బైబిలు చెప్తుండగా, సాతానుబోధయైన వారమునకు ప్రాముఖ్యత ఏమిటి? లోకమంతా మోసపోలేదా? గుడ్‌ఫ్రైడే–ఈస్టర్ సన్‌డే మోసం కాదా? ఆలోచించండి. బైబిలు పండుగలు తెలియవు గాని బైబిల్ బోధకులు: క్రొత్తనిబంధనకీ–పాతనిబంధనకీ తేడా తెలియనివాడు పాస్టర్: సోదె చెప్పే సోదెగాళ్ళు సూపర్‌వైజర్లు: అబద్ధాలు, మాయ, మోసం చేసేవాళ్ళు సంస్థానాధిపతులు: వీరంతా అయ్యగార్లు, అమ్మగార్లు. నేను 25 సం॥రాల నుండి వెతుకుతున్నాను ఎవరైనా సత్యం చెప్పే బోధకులు ఉన్నారా అని? నాకు ఇంతవరకూ ఎవరూ కనిపించలేదు. అడిగితే చెప్పరు నిజం చెబితే నమ్మరు. సాయంత్రం నుండి మరుసటి సాయంత్రం వరకు ఒక రోజని బైబిలు చెప్తుంటే, రాత్రి 12 గం॥ల నుండి రోజు ప్రారంభమగుట అబద్ధముకాదా? ఈ అబద్ధాలు బైబిలు తెలిసిన మేమెలా నమ్మాలి? ఎలా నమ్మగలం? వాక్యానికి ఏదీ కలుపకూడదు, తీయకూడదు అని చెప్తున్నారే? ఆ పని చేసేది వీరేగదా! పాతనిబంధనకాలంలో కొంతమంది తిండిబోతు బోధకులు ప్రజల్ని పాపాలకు పురికొలిపేవారట. వాళ్ళు పాపం చేయడం వలన వీళ్ళకి మాంసం దొరికేదట. ఈనాడు పాస్టర్లు కూడా ఇలాగే ఉన్నారు "నా జనుల పాప పరిహారబలిమాంసమును (యాజకులు) తిందురు గనుక జనులు మరి అధికముగా పాపము చేయవలెనని వారు కోరుదురు" హోషేయ 4:8. తెలుగు రిఫరెన్సు బైబిలులో చదవండి. ఈ వాక్యం మీ బైబిల్లో అలా లేదులెండి. అయినా ఫుట్‌నోట్‌లో కూడా చూడండి. బైబిలు సొసైటీవారిలో కూడా సాతాను పనిచేస్తూ ట్రాన్స్‌లేషన్ రూపంలో అర్థాలు మార్చేస్తున్నారు. అదే విధంగా నేడు పాస్టర్లు ప్రజలను తప్పుదారికి మళ్ళించి దండుకోవడం అలవాటు చేసుకున్నారు. ఇలా ప్రజలు తప్పుదారిలో ఉంటే వాళ్ళకి ఎన్నో కానుకలు, ఎంతో డబ్బు, వస్తాయికదా! క్రిస్మస్, క్రొత్త సంవత్సరం పండుగల పేరున ఎంత దోచుకోవచ్చు? ఇలా అర్థం కాని రీతిలో బోధకులు ప్రజలను తప్పుడు సిద్ధాంతాల దారిలో ఉంచి వీళ్ళు భ్రష్టబోధలు చెయ్యడమే గాక విశ్వాసులను భ్రష్టులుగా చేస్తున్నారు. నిజం చెప్పవలసిన బోధకుడే అబద్ధాలను బోధిస్తుంటే (కంచె చేను మేసేస్తుంటే) ఈ వ్యవస్థ ఎలా మారగలదు? పొట్టకూటికోసం అన్యాచారాలకు బానిసలై వాటిని ఆచరించడం వలన వాక్యమునకు ఏ విధమైన ప్రాముఖ్యత ఉండదు. వాక్యం నిరర్థకమైపోతుంది మత్తయి 15:9. వ్యర్థారాధన చేస్తూ, చేయిస్తూ అబద్ధాలతో జీవిస్తూ పరలోకం ఎలా వెళ్ళగలరు? గనుక క్రిస్మస్, క్రొత్తసం॥ము జనవరి1 మనది కాదు. అది సాతాను ప్రవేశపెట్టిన డూప్లికేట్ సంవత్సరం. వాడి డూప్లికేట్ పండుగలకు బైబిల్ రిఫరెన్సులు వాడుకోకండి. అది కలిపి చెరపడం అవ్వుతుంది. వాక్యానికి వ్యతిరేకంగా పండుగలు జరిపించునవి ఆయన సంఘాలు కావు. ఆయన నామంలో సాతాను సంఘాలు మాత్రమే. యెషయా 4:1లోని స్త్రీల వంటి సంఘాలు. ఈ ఏడుగురు స్త్రీలు (వీళ్ళు కన్యకలు కారు, ఆఖరికి బుద్ధిలేని కన్యకలు కూడా కారు) ఒక్క పురుషుడైన మెస్సీయను పట్టుకొని, ఆయన పేరు చెప్పుకుంటూ వాళ్ళ అన్నము, వాళ్ళ వస్త్రాలు వాళ్ళే సంపాదించుకుంటూ బ్రతికేస్తున్నారు. ఈ స్త్రీలు సంఘాలకు సాదృశ్యంగా ఉన్నారు. పేరుకి క్రైస్తవ సంఘాలే గాని అందులో ఆయన లేడు. ఆయన బోధ లేదు, ఆయన అధికారం లేదు, ఆయన యాజకులు లేరు, ఆయన వాక్యం అంతకన్నా లేదు అంతా డూప్లికేట్. యరొబాము దేవాలయమువలె (1రాజులు 12:25–33) ఈ మిషను సంఘాలు ఉన్నాయి. అన్నీ మిషనులోనే దొరికేస్తున్నాయి. అటాచడ్ బాత్‌రూమ్ వలె అటాచడ్ నరకం కూడా ఈ మిషనులన్నింటికీ అమర్చబడి ఉంది. ఇది ఎవరికి కనిపిస్తుంది? ఆయన ఉగ్రతదినమందు సంస్థానాధిపతులను, సంస్థలో పనిచేస్తున్న కూలి బోధకులను, సంస్థల బోధల ద్వారా మోసపోయిన విశ్వాసులను అగ్నిగుండంలోకి త్రోసేస్తాడు. అందుకే అబద్ధాలనుండి బయటకు రండి. ఆరని అగ్నికి ఆహుతైపోకముందే సత్యాన్ని వెంబడించండి. బైబిల్లోని పండుగలను వెదికి వెంటాడండి. అబద్ధ బోధకుల బారి నుండి వెడలి రండి.

**సత్యవాక్యమునకై మమ్మును సంప్రదించండి.**